మహా ప్రళయ కాళీ

MAHA PRALAYA KALI



మహా ప్రళయ కాళీ

రచయిత: గోపరాజు వేంకట ఆదిత్య

ప్రచురణకర్తలు: శ్రీ గాయత్రి పబ్లిషర్స్

ముందుమాట

విశ్వ సృష్టి ఎలా జరిగిందో తెలుసుకోవాలనే కుతూహలం అందరికీ ఉంటుంది, కానీ ఆ సృష్టి అంతమయ్యే 'ప్రళయం' గురించి తెలుసుకోవడం అంటే సామాన్యులకు ఒక విధమైన భయం. శ్రీరామచంద్రుని వైరాగ్యానికి, వశిష్ఠ మహర్షి అందించిన బ్రహ్మజ్ఞానానికి ప్రతిరూపమైన **'యోగవాశిష్ఠం'** ఒక అమూల్యమైన ఆధ్యాత్మిక నిధి. ఆ మహోన్నత గ్రంథంలోని 'నిర్వాణ ప్రకరణం' వంటి ఘట్టాల ప్రేరణతో, సృష్టి మరియు లయాల వెనుక ఉన్న పరమార్థాన్ని సామాన్యులకు సైతం అర్థమయ్యేలా ఈ పుస్తకం వివరించడానికి ప్రయత్నిస్తుంది.

శ్రీరామచంద్రుడు వశిష్ఠ మహర్షిని భక్తితో ఇలా అడిగారు: "మహాత్మా! అసలు ప్రళయం అంటే ఏమిటి? మహా ప్రళయం అంటే ఏమిటి? ఈ రెండింటి మధ్య ఉన్న తేడాను, ఇవి జరిగినప్పుడు లోకం ఏ స్థితికి చేరుకుంటుందో సామాన్యులకు కూడా అర్థమయ్యేలా వివరించండి."

ప్రళయం అంటే ఏమిటి?

మనకు పగలు, రాత్రి ఉన్నట్టే సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడికి కూడా పగలు, రాత్రి ఉంటాయి. బ్రహ్మగారి పగలు ముగియగానే ఆయన నిద్రపోతారు. ఆ సమయంలో వచ్చేదే 'సాధారణ ప్రళయం'. ఇందులో భూమి, స్వర్గం వంటి లోకాలు తాత్కాలికంగా నీటిలో మునిగిపోతాయి. సూర్యుడి వేడికి భూమి మాడిపోవడం, ఆపై కుంభవృష్టి కురిసి లోకమంతా ఒకే ఒక నీటి సముద్రంలా మారిపోవడంజరుగుతుంది. సాధారణ ప్రళయం అనేది బ్రహ్మదేవుడికి ఒక రాత్రి లాంటిది. ఈ రాత్రి సమయం ముగియగానే, అంటే ప్రళయం పూర్తి కాగానే మళ్ళీ 'బ్రాహ్మ ముహూర్తం' లేదా సృష్టి కాలం మొదలవుతుంది. ఈ సాధారణ ప్రళయం తర్వాత బ్రహ్మదేవుడు తన యోగనిద్ర నుండి మేల్కొంటాడు. ఆయన కళ్లు తెరవగానే, అంతకుముందు నీటిలో

మునిగిపోయిన లోకాలను తిరిగి సరిదిద్దడం ప్రారంభిస్తారు. బ్రహ్మదేవుడు నిద్రలేవగానే, ప్రళయ జలాల్లో మునిగి ఉన్న భూమిని పైకి తీసుకువస్తారు. ప్రళయానికి ముందు ఏ జీవులైతే శరీరాలను వదిలేసి బ్రహ్మలో నిద్రపోయారో, వారందరూ తమ తమ పాత కర్మల వాసనలతో (గుర్తులతో) మళ్ళీ కొత్త శరీరాలను పొందుతారు. ఇది సరిగ్గా మనం రాత్రి పడుకుని, ఉదయం లేవగానే మన పాత పనులను ఎలా మొదలుపెడతామో అలాగే ఉంటుంది. ప్రళయం ముగిశాక, బ్రహ్మదేవుడు నిద్రలేచి మళ్ళీ సృష్టిని మొదలుపెడతాడు. అంటే ఇది ఒక చక్రం లాంటిది. పాతది పోవడం, కొత్తది రావడం. ఈ ప్రళయం అనేది ప్రకృతికి ఒక విరామం వంటిది. ఇది అర్థం చేసుకున్నవాడు చావుకు భయపడడు.

మహా ప్రళయం అంటే ఏమిటి? ఆ సమయంలో ఏం జరుగుతుంది?

బ్రహ్మదేవుడికి ఒక పగలు ముగియగానే ఒక 'సాధారణ ప్రళయం' (దీనినే నైమిత్తిక ప్రళయం అంటారు) వస్తుంది. ఇలాంటి ప్రళయాలు 36,000 జరిగిన తర్వాత ఒక 'మహా ప్రళయం' సంభవిస్తుంది. బ్రహ్మగారి నూరేళ్ల ఆయుష్షు పూర్తయ్యాక వచ్చేది 'మహా ప్రళయం'. ఇది సాధారణ ప్రళయం కంటే భయంకరమైనది. మహా ప్రళయం అనేది ఒకేసారి జరిగిపోయేది కాదు, అది ఒక క్రమ

పద్ధతిలో ప్రకృతిని లయం చేస్తుంది. వశిష్ఠ మహర్షి తన సూక్ష్మ రూపంలో చూసిన ఆ దృశ్యాలు ఇలా ఉన్నాయి:

భయంకరమైన ఎండ (ద్వాదశాదిత్యులు): మొదట ఆకాశంలో ఒక సూర్యుడు కాదు, ఏకకాలంలో పన్నెండు మంది సూర్యులు ఉదయిస్తారు. ఆ వేడికి భూమిపై ఉన్న నదులు, సముద్రాలు అన్నీ ఆవిరైపోతాయి. చెట్లు, పర్వతాలు అన్నీ మాడి మసి అయిపోతాయి. భూమి అంతా ఒక ఎర్రగా కాలిన ఇనుప గుండులా మారిపోతుంది.

ప్రళయ కాల మేఘాలు (పుష్కలావర్తక మేఘాలు): ఆ వేడి తర్వాత, ఆకాశంలో ఏనుగులంత పరిమాణం ఉన్న నల్లటి మేఘాలు కమ్ముకుంటాయి. ఇవి మామూలు వర్షం కాదు, కొండలు పగిలిపోయేంత ధారలతో కుంభవృష్టిని కురిపిస్తాయి. కాలిన భూమి ఒక్కసారిగా చల్లబడి, లోకమంతా జలమయం అయిపోతుంది.

పంచభూతాల విలీనం: నీరు పెరిగిపోయి నిప్పును మింగేస్తుంది. ఆ నీటిని గాలి పీల్చేస్తుంది. ఆ గాలిని ఆకాశం తనలో కలిపేసుకుంటుంది. అంటే మనకు కనిపించే ఈ గాలి, నీరు, నిప్పు అన్నీ ఒక్కొక్కటిగా మాయమైపోతాయి.

బ్రహ్మాండం బద్దలవ్వడం: చివరకు ఈ విశ్వం అనే ఒక గుడ్డు (బ్రహ్మాండం) పగిలిపోయినట్లు అవుతుంది. సూర్య చంద్రులు

దీపాలు ఆరిపోయినట్లు ఆరిపోతారు. దేవతలు, మనుషులు, ప్రాణులు అనే తేడా లేకుండా అందరూ ఆ పరమాత్మలో నిద్రపోతారు.

నిశ్శబ్దం – శూన్యం: అంతా అయిపోయాక అక్కడ వెలుగు ఉండదు, చీకటి ఉండదు. శబ్దం ఉండదు, కదలిక ఉండదు. కేవలం అనంతమైన 'చిదాకాశం' (జ్ఞానమనే ఆకాశం) మాత్రమే మిగిలి ఉంటుంది. దానినే మనం పరమశివుడు లేదా పరబ్రహ్మం అంటాము.

అప్పుడు శ్రీరామచంద్రుడు ఇలా అడిగారు:

"మహాత్మా! మహా ప్రళయ కాలంలో మహా కాళీ ఎలా ఆవిర్భవిస్తుంది?

మహా ప్రళయ సమయంలో విశ్వంలో ఏర్పడిన అలజడి నుంచి ఒక అద్భుతమైన శక్తి ఉద్భవిస్తుంది. ఆ శక్తే మహా ప్రళయ కాళీ. ఆ శక్తి ఉద్భవించగానే విశ్వమంతా నాట్యం చేస్తున్నదా అన్న విధంగా మారిపోతుంది. ఈ నాట్యమునే తాండవం అనే పేరుతో పిలుస్తాము. ఆ మహా ప్రళయ కాళీ తాండవం చేయడం మొదలుపెట్టగానే మహా ప్రళయం తన భీకర రూపాన్ని దాల్చుతుంది. ఆమె నాట్యానికి ఈ అనంత విశ్వంలోని నక్షత్రాలు,

పాలపుంతలు అన్నీ ఒక దండలా మారి ఆమె మెడలో హారంగా అలకరించబడ్డయ్య అన్న విధముగా ఉంటుంది అంతటి అనంతమైన విశ్వం ఆ మహా శక్తి ముందు ఒక చిన్న నగలా కనిపిస్తుంది.

మహా ప్రళయ కాళీ తాండవం వల్ల పుట్టిన వేడికి పన్నెండు మంది సూర్యులు ఒక్కసారిగా పుడతారు. గాలి, నీరు, నిప్పు, ఆకాశం, భూమి అనే ఐదు తత్వాలు ఒకదానిలో ఒకటి కలిసిపోయి పూర్తిగా మాయమైపోతాయి. ఆ మహా కాళీ నాట్యం చేస్తుంటే ఆ వేగానికి ఈ బ్రహ్మాండం ఒక్కసారిగా బద్ధలైపోతుంది; ఆ నాట్యం తీవ్రమవ్వగా అక్కడ ఒక అద్భుతమైన కాంతి పుంజం ఉద్భవిస్తుంది ఆ వెలుగు అనే పరమేశ్వరుడే నేడు మనం కొలిచే మహా కాళేశ్వరుడు. మహా ప్రళయ కాళీ యొక్క ఆ ఆవేశాన్ని, ఉగ్రత్వాన్ని తగ్గించడానికి ఆ మహా కాళేశ్వరుడు పాదాల కిందకి వచ్చినట్టు అనిపిస్తుంది. ఆ తర్వాత ఆ మహా ప్రళయ కాళీ నెమ్మదిగా ఆ మహాకాళేశ్వరుడి నుండి వెలువడుతున్న అనంతమైన కాంతిలో లీనమైపోతుంది.

అప్పుడు శ్రీరామచంద్రుడు ఆశ్చర్యంతో

"స్వామీ! ఈ సమస్త విశ్వానికి తల్లి అయిన ఆ మహాకాళి, తన బిడ్డలైన ప్రాణులందరినీ అంత భయంకరంగా ఎలా సంహరిస్తుంది? కన్నతల్లి తన పిల్లల పట్ల ఇంతటి కఠినమైన పనిని ఎలా చేయగలదు?"

అని అడిగిన ప్రశ్నకు వశిష్ఠ మహర్షి ఇలా సమాధానమిచ్చారు:

ఓ రామా! ఈ సమస్త విశ్వం మరేదో కాదు, అదంతా ఒక మహా శక్తి స్వరూపం. నువ్వు, నేను మరియు ఈ ప్రపంచంలోని ప్రతి ప్రాణి.. మనలో ఉన్న 'అహంకారాన్ని' (నేను అనే భావం) పక్కన పెడితే, అందరం ఆ నిర్మలమైన శక్తి స్వరూపాలమే. నువ్వు ఈ ప్రళయాన్ని లోక రీత్యా (లౌకిక దృష్టితో) చూస్తున్నావు, అంటే ప్రాణాలు పోతున్నాయని, శరీరం నశిస్తోందని భావిస్తున్నావు. అందుకే నీకు భయం కలుగుతోంది. కానీ, అహంకారం లేకుండా జ్ఞానంతో చూస్తే.. ఇక్కడ ఎవరూ ఎవరినీ సంహరించడం లేదు.

నదులన్నీ వెళ్లి సముద్రంలో కలిసినట్లు, చిన్న చిన్న శక్తి రూపాలన్నీ (జీవులు) తిరిగి తమ మూలమైన అనంత శక్తిలో (మహాకాళిలో) విలీనం అవుతున్నాయి. ఇది ఒక శక్తి మరో మహా శక్తిలో కలిసిపోవడం మాత్రమే. ఎలాగైతే తల్లి తన బిడ్డను ప్రేమతో ఒడిలోకి తీసుకుంటుందో, మహా కాళీ కూడా ఈ చిన్న చిన్న శక్తి

రూపాలను తనలో ఐక్యం చేసుకుంటోంది. కాబట్టి ఇది భయపడాల్సిన నాశనం కాదు, పరమాత్మలో కలిసే ఒక పవిత్రమైన ప్రక్రియ."

శ్రీరామచంద్రుడు ఆశ్చర్యచకితుడై, వినమ్రంగా వశిష్ఠ మహర్షిని ఇలా అడిగారు:

"మహాత్మా! కాలాతీతమైన ఈ రహస్యాలను, కంటికి కనిపించని ఆ మహా ప్రళయ దృశ్యాలను, మరియు మహా కాళీ ఆవిర్భావ విశేషాలను మీరు ఇంత స్పష్టంగా ఎలా తెలుసుకోగలిగారు? ఏ జ్ఞాననేత్రంతో మీరు ఈ అద్భుతాలను వీక్షించారో నాకు వివరించండి."

"రామా, నేను ఈ దృశ్యాలన్నీ నా మామూలు కళ్లతో చూడలేదు; నా మనసును, బుద్ధిని పక్కన పెట్టి అత్యంత నిర్మలమైన **'చిత్-రూపం'**లో (శుద్ధ చైతన్య స్వరూపంలో) ఉండి చూశాను. సృష్టికి చాలా దూరంగా ఒక సాక్షిలా నిలబడి, ఇప్పటివరకు నేను ఎన్నో సాధారణ ప్రళయాలను, అలాగే సర్వం లయమైపోయే ఒక భీకరమైన 'మహా ప్రళయాన్ని' కూడా వీక్షించాను."

శ్రీరాముని మనస్థితి సంతృప్తి చెందలేదని గమనించిన వశిష్ఠ మహర్షి, అప్పుడు ఇలా అన్నారు:

"ఓ రామా! ఇప్పటిదాకా నేను వివరించిన ఈ సృష్టి, ప్రళయం, ద్వాదశాదిత్యులు, పుష్కలావర్తక మేఘాలు, మహా కాళీ అనేవన్నీ కేవలం నీ బుద్ధికి ఒక దారి చూపడానికే. సత్యాన్ని పదాల రూపంలో బంధించడం సాధ్యం కాదు, అందుకే వివిధ పేర్లను, రూపాలను ఒక సాధనంగా ఉపయోగించాను. ఒక్కసారి నీకు ఆ పరమ సత్యం బోధపడితే, ఇక ఈ పరిభాషలతో గానీ, పదాల లోతులతో గానీ పనిలేదు.

దీనిని ఇలా అర్థం చేసుకో—ఒక వ్యక్తిని పరిచయం చేసుకునే వరకు మనకు అతని 'చిత్రపటం' అవసరం. ఆ బొమ్మను చూస్తూనే మనం అతనిని ఊహించుకుంటాం. కానీ ఆ వ్యక్తి నీ ఎదుట నిలబడి, నీకు పరిచయమైన తర్వాత.. ఇక ఆ చిత్రపటం నీకు పని ఏముంది? అలాగే, నీవు దేనినైతే బయట శక్తులుగా, రూపాలుగా చూస్తున్నావో, ఆ అనంతమైన శక్తి మరెక్కడో లేదు.

నీలోని అజ్ఞానపు పొరలు తొలగి, నీ అసలు స్వరూపాన్ని నీవు గుర్తించిన మరుక్షణం—ఆ ఆదిశక్తి (మహాకాళి), ఆ అనంత చైతన్యం (కాళేశ్వరుడు) వేరు కాదని, అది నీవేనని అర్థమవుతుంది.

ఆ స్థితిలో నీవు కేవలం రాముడివి కావు, నువ్వే సాక్షాత్తూ మహా కాళేశ్వరుడివి!"

* *

మహా ప్రళయం అనంతరం సమస్త విశ్వం ఆ పరమాత్మ యందే లీనమైపోతుంది. ఆ సమయంలో రూపం, నామం, వెలుగు, చీకటి అనే భేదాలు లేని ఒకానొక అనంతమైన నిశ్శబ్దం మాత్రమే మిగిలి ఉంటుంది. దీనినే శుద్ధ చైతన్యం అంటారు.

చాలా కాలం పాటు ఈ నిశ్చల స్థితి కొనసాగిన తర్వాత, ప్రశాంతంగా ఉన్న సముద్రంలో అల ఉద్భవించినట్లుగా ఆ పరమాత్మలో ఒక చిన్న సంకల్పం కలుగుతుంది. ఆ ఆలోచన నుండే మళ్ళీ కాలం, ఆకాశం, ప్రాణం పుట్టుకొస్తాయి. గతంలో లీనమైన జీవులందరూ తమ కర్మ వాసనలతో మరల కొత్త శరీరాలను ధరించి సృష్టిలో అడుగుపెడతారు. ఈ విధంగా సృష్టి, స్థితి, లయలు అనేవి ఒక చక్రంలా నిరంతరం సాగుతూనే ఉంటాయి. నిద్ర నుండి మేల్కొన్న వాడు తన కలల ప్రపంచాన్ని ఎలా వదిలివేస్తాడో, జ్ఞాని కూడా ఈ సృష్టి పునరాగమనాన్ని చూసి చలించకుండా తన ఆత్మ యందే రమిస్తాడు.

"ప్రళయం వచ్చినా, మహా ప్రళయం వచ్చినా మన కర్మ వాసనలు మనల్ని వదలవు; అవి విత్తనాల్లా పరమాత్మలో దాగి ఉండి, మళ్ళీ సృష్టి మొదలవ్వగానే మనల్ని పుట్టిస్తాయి. కానీ, ఎప్పుడైతే ఒక మనిషి జ్ఞానంతో తనలోని కోరికలను, 'నేను' అనే అహంకారాన్ని పూర్తిగా వదిలేస్తాడో, అప్పుడు ఆ కర్మ విత్తనాలు జ్ఞానమనే అగ్నిలో మాడిపోతాయి. అలా వాసనలు నశించిన వానికి మళ్ళీ జన్మ అనేదే ఉండదు; నది వెళ్లి సముద్రంలో కలిసినట్లు, అతడు శాశ్వతంగా ఆ పరమాత్మలో లీనమైపోతాడు. ఇదే నిజమైన **మోక్షం.**"

మొదటి సృష్టిలో జీవులకు పాత కర్మ వాసనలు ఉండవు. ఎందుకంటే అంతకుముందు సృష్టి లేదు కాబట్టి. అందుకే మొదటి సృష్టిలోని జీవులు అత్యంత పవిత్రంగా, దైవత్వంతో నిండి ఉంటారు. వారు కేవలం బ్రహ్మదేవుని సంకల్పం ద్వారా పుట్టినవారే (మానస పుత్రులు). మొదటి సృష్టిలో అహంకారం, స్వార్థం లేవు. బ్రహ్మదేవుడు మరియు ఆయన మానస పుత్రులు కేవలం ఒక **ఆట (లీల)** లాగా ఈ సృష్టిని విస్తరించారు. కానీ కాలక్రమేణా, జీవులలో 'నేను' అనే భావం (అహంకారం) పెరగడం వల్ల కర్మలు పేరుకుపోయాయి. ఆ కర్మలే 'వాసనలు'గా మారి, తర్వాతి జన్మలకు కారణమయ్యాయి.